క్లుప్తంగా

పంచాయతీలో డీపీఓ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ శాంత లక్ష్మి

కె.గంగవరం: స్థానిక గ్రామ పంచాయతీని శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) శాంత లక్ష్మి సందర్శించారు. పంచాయతీలో రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలన్నారు. పంచాయతీల అభివృద్ధికి కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధిలైట్ల నిర్వహణ, పారిశుధ్యం, డ్రైన్ల క్లీనింగ్ తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉండకూడదన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి చంటి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రామచంద్రపురం: పట్టణంలోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో విద్యుత్ పరికరాల మార్పు చేస్తున్న కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఈఈ కె.రత్నాలరావు, ట్రాన్స్‌కో కాకినాడ ఈఈ ఖాజా రహంతుల్లా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని కె.గంగవరం, రామచంద్రపురం మండలాలు, మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం మండలాల్లోని 33 కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పశువైద్య శిబిరం



భీమక్రోసుపాలెంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ కృష్ణార్జున

రామచంద్రపురం రూరల్: మండలంలోని భీమక్రోసుపాలెంలో శుక్రవారం మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మండల పశువైద్యాధికారి డాక్టర్ మేడిశెట్టి కృష్ణార్జున ప్రారంభించారు. గ్రామంలోని 72 మంది రైతులకు చెందిన 126 పాడి పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. పాల దిగుబడిని పెంచేందుకుగాను రైతులకు మినరల్ మిక్చర్, లివర్ టానిక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి కృష్ణార్జున మాట్లాడుతూ పాలల్లో వెన్నశాతం పెరుగుదలకు అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. పశుగ్రాసం పెంపకం అవశ్యకతను వివరించారు. వైద్యులు పి.రామచంద్రరావు, భావనాజ్యోతి, ఎం.బిందు, సంయుక్త, విజయ్‌దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



గొల్లపాలెంలో వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేస్తున్న పోలీసులు

కాజులూరు: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకూ మండల గ్రామాల్లో వ్యాపారస్తులంతా తమ షాపుల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం గొల్లపాలెంలో వ్యాపారస్తులకు పోలీసులు నోటీలు జారీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ పాఠశాలలను, కళాశాలలు, ఫైనాన్స్ కంపెనీలు, పెట్రోల్ బంకులు ఇతర వ్యాపార సంస్థల వద్ద పరిసరాలు, రోడ్డు మార్గాలు కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు, వినియోగంపై కలిగే ప్రయోజనాలను వర్తక సంఘం సభ్యులకు అవగాహన కల్పించారు.

కోడిపందేలపై పోలీసుల దాడి: నలుగురి అరెస్ట్

కాజులూరు: గ్రామంలోని కోడిపందేల స్థావరాలపై శుక్రవారం దాడులు చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ తెలిపారు. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు గ్రామంలోని ధనలక్ష్మీపేట సమీపాన తమ సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఒక కోడి, రెండు కత్తులు, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.1520 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు.

కుచించుకుపోతున్న కోరంగి కాలువ

- 32 వేల ఎకరాల్లో సాగునీటికి ఇక్కట్లు
- శివారు భూములకు నీరందక రైతుల ఆందోళన



చేదువాడ వద్ద కుచించుకుపోయి తూడు, గుర్రపుడెక్కతో మూసుకుపోయిన కోరంగి కాలువ

కాజులూరు: గోదావరినదిలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ డెల్టా ప్రాంతంలోని కాలువ శివారు భూముల రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఎగువ నుంచి సాగునీరు విడుదలవుతున్న డెల్టాలోని పంటకాలువల తూడు, గుర్రపు డెక్కలతో నిండిపోయి, పూడికలు పెరిగిపోవడంతో పొలాలకు సాగునీరు అందక రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత కొంత కాలంగా పంట కాలువలు ఆధునీకరణ పనులకు నోచుకోకపోవడంతో కాలువ శివారు భూముల్లో ఉన్న పంటపొలాలకు సాగునీరందడం కష్టతరంగా మారింది. ముఖ్యంగా రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో వెల్ల లాకుల నుంచి మంజేరు వరకు ఉన్న కోరంగి కాలువ కుచించుకుపోయింది. ఇరువైపులా మేటలు వేసి పిచ్చి మొక్కలు, తూడు, గుర్రపుడెక్క పెరిగిపోయి ఉన్నాయి. ఫలితంగా 14 మీటర్ల వెడల్పున ఉండాల్సి కాలువ సన్నగా మారి 8 మీటర్లకు తగ్గిపోయింది. కోరంగి కాలువ కింద రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని కాజులూరు, రామచంద్రపురం మండల గ్రామాలతో పాటు కరప, తాళ్లరేవు మండలాల్లో సుమారు 32 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. కాలువ కుచించుకుపోవడంతో ఈ భూములకు తరచూ సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కోరంగి కాలువ వెల్ల లాకుల నుంచి మంజేరు వరకు ప్రవహించి అక్కడ రెండు విభాగాలుగా విడిపోయి ఒక భాగం మంజేరు శివార్లలో కోరంగి డ్రెయిన్‌లోకి మరో భాగం శలపాక, తణుకువాడల మీదుగా ప్రవహించి గొర్రిపూడి వద్ద తుల్యభాగ డ్రెయిన్‌లోకి కలుస్తుంది. ఈ కాలువకు అనుసంధానంగా ఇరువైపులా సుమారు 100 పిల్లకాలువలు ఉన్నాయి. 2009 మే నెలలో అప్పటి ప్రభుత్వం ఈ కాలువను ఆధునీకరించారు. దాదాపు రూ.30 లక్షలు వెచ్చించి కోరంగి కాలువలో పొక్లెయిన్‌తో పూడికలు తొలగించి వెడల్పు చేశారు. అయితే ఆ విధంగా తీసిన మట్టిని కాంట్రాక్టరు కాలువ గట్లపైనే వేయడంతో కొద్ది రోజుల తరువాత ఆ మట్టి కరిగిపోయి మరలా కాలువలోకే చేరింది. దీంతో కాలువ పరిస్థితి మరలా మొదటికే వచ్చింది. అప్పటి నుంచి నేటి వరకు ఈ కాలువ ఆధునీకరణ పనులకు నోచుకోలేదు. ప్రస్తుతం కాలువలకు ఇరువైపులా మట్టి మేటలు వేసింది. దీంతో కాలువ సగభాగం మూసుకుపోయింది. ఉన్న కాలువలో తూడు, గుర్రపుడెక్క పెరిగి పోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీనివల్ల ఆయకట్టు భూములకు సక్రమంగా నీరు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండల గ్రామాల్లోని వరి పొలాలు నాట్లు దశ పూర్తయి దుబ్బుకట్టే దశలో ఉన్నాయి. ఈ దశలోనే పొలాలకు సాగునీరు ఎక్కువగా అవసరమవుతుందని కాలువ మూసుకుపోయిన కారణంగా పొలాలకు సాగునీరు అందకపోవడంతో ఇబ్బందులు ఎర్పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కోరంగి కెనాల్‌లో సాగునీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా యుద్ధప్రాతిపదికన తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టాలని లేకుంటే భవిష్యత్‌లో మొత్తం కాలువ మూసుకుపోయి పొలాలు నీరు అందక బీడువారే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు అంటున్నారు.

నీరు అందడం లేదు



ప్రధాన కాలువ కోరంగి కెనాల్లో తూడు, గుర్రపుడెక్క పేరుకుపోవటంతో కాలువ శివారు భూముల్లో పొలాలకు సాగు నీరందడం లేదు. కొంగోడు చానల్‌కు అడపాదడపా వచ్చే సాగునీరు కాలువ ఎగువ రైతులు వినియోగించుకోవడంతో శివారు భూముల్లో ఉన్న గొల్లపాలెం పొలాలు తడి ఆరిపోతున్నాయి.

– డి.రాఘవ, రైతు, గొల్లపాలెం

కోరంగి కెనాల్‌ను ఆధునీకరించాలి



గత కొన్నాళ్లుగా కోరంగి కెనాల్ ఆధునీకరణకు నోచుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. కాలువ క్రమేపీ మూసుకుపోయి సాగునీరు శివారు భూములకు చేరడం లేదు. సాధ్యమైనంత త్వరలో అధికారులు కోరంగి కెనాల్ ఆధునీకరణ పనులు చేపట్టాలి.

– నల్లమిల్లి శ్రీవిష్ణురెడ్డి, రైతు, మొగలిపాలెం

విద్యార్థులు మంచి లక్ష్యాలతో ఎదగాలి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న సీఐ దొరరాజు

మండపేట: విద్యార్థులు బాల్యం నుంచి మంచి లక్ష్యాలను ఏర్పరుచుకుని ఉన్నతంగా ఎదగాలని రూరల్ సీఐ పి.దొరరాజు ఆకాంక్షించారు. మండలంలోని అర్తమూరు సత్యభాస్కర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాలు, ర్యాగింగ్, సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల మోనిటరింగ్ కమిటీ అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రెడ్డి, సీఐ దొరరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ దొరరాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ చిన్నతనం నుంచే లక్ష్యం ఉండాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. వ్యసనాలకు అలవాటు పడిన వారితో స్నేహం మంచిది కాదన్నారు. అటువంటి వారు ఎవరైనా వుంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ముందుగా తెలియజేస్తే వారి జీవితాలను కాపాడిన వారవుతారన్నారు. మితిమీరిన సెల్‌ఫోన్ వాడకం మంచిది కాదన్నారు. ప్రస్తుతం విద్యార్థులు సోషల్ మీడియాను ఫాలో అయినంతగా చదువును ఫాలో కావడం లేదన్నారు. భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది చదువు మాత్రమే అన్న విషయాన్ని గ్రహించి పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ గౌరవ అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎనిమిది పోలింగ్ కేంద్రాలు



తహసీల్దార్ తేజేశ్వరరావు

మండపేట: ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు నియోజకవర్గంలో ఎనిమిది పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు స్థానిక తహసీల్దార్ తేజేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో ఎమ్మెల్సీ ఎన్నికల వివరాలను తెలిపారు. ఈ నెల 3 నుంచి 10 వరకూ నామినేషన్ల స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, ఉపసంహారణ ఉంటాయన్నారు. ఈ ఎన్నికకు ఓటు నమోదు చేసుకునేందుకు ఈ నెల 3 వరకూ అవకాశం ఉందన్నారు. అసక్తి కలిగిన పట్టభద్రులు ఫారం 18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

7407 మంది ఓటర్లు

ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నియోజకవర్గంలో 7407 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో మండపేట మండలంలో 3,930, కపిలేశ్వరపురం మండలంలో 1620, రాయవరం మండలంలో 1857 మంది గ్యాడ్యుయేట్ ఓటర్లు ఉన్నట్టు వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పురుషులు 4459 మంది ఉండగా, మహిళలు 2948 మంది ఉన్నారని తెలిపారు. పోలింగ్‌నకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కపిలేశ్వరపురంలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా రాయవరంలో రెండు, టౌన్ పరిధిలో ఏడిద రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. రూరల్ ఏరియా ఓటర్ల కోసం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, రామహిందూ మున్సిపల్ పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

చట్టాలపై కనీస అవగాహన ఉండాలి



సమావేశంలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అద్వకేట్ సత్యవాణి తదితరులు

కె.గంగవరం: చట్టాలపై మహిళలకు కనీస అవగాహన ఉండాలని అడ్వకేట్‌లు దోమలపాటి సత్యనారాయణ, కేవీప సత్యవాణి అన్నారు. మండల కేంద్రమైన కె.గంగవరంలోని మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద శుక్రవారం జాతీయ మహిళా కమిషన్, రామచంద్రపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ కార్యక్రమం నిర్వహించారు. అడ్వకేట్‌లు మాట్లాడుతూ వారసత్వపు ఆస్తుల కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కనీస చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే ప్రతి ఒక్కరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. వరకట్న నిరోధకచట్టం, బాల్యవివాహ నిషేధ చట్టం వంటి అంశాలపై మహిళలకు సూచనలు చేశారు. లోక్‌అదాలత్ పరిష్కార వేదికలను కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా హక్కుల కోసం రిసోర్స్‌పర్సన్‌లు ఉన్నారని వారి ద్వారా అవగాహన చేసుకుని జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో బి.దుర్గారావు, బి.జనార్ధనరావు, ఏపీఎం ఎస్.దుర్గమ్మ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు దుర్గాదేవి, కార్యదర్శి కనక దుర్గ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పి.అనురాధ, ఎం.పార్వతి, బి.చంద్రకళ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల పునః ప్రతిష్ఠ



విగ్రహ పునఃప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేత తోట పృథ్వీరాజ్ తదితరులు

రాయవరం: మండలంలోని పసలపూడి గోపరితోటలో పునర్నిర్మించిన భద్రావతి సమేత భావనారుషి ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకులు శతాధిక ప్రతిష్ఠాపనాచార్య, వైఖానాసగమ ప్రవర పెదపూడి రఘురాం అర్చకత్వంలో వేద పండితులు పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. తొలుత పుణ్యాహవాచనం, పంచగవ్యారాధన, పంచగవ్యప్రాసనం, అగ్ని మధనం, సమగ్ర పూజ, ఆదివాస హోమం, పాయశ హోమం, అగ్ని హోమం, తదితర హోమాలు చేశారు. ఉదయం 10.10 గంటలకు శాస్త్రోక్తంగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, పారిశ్రామికవేత్తలు చింతా కృష్ణారెడ్డి, చైతన్య రాజబాబు, ప్రముఖ వైద్యురాలు చింతా గిరిబాల, వైఎస్సార్ సీపీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, పోతంశెట్టి సత్తిబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ



అంగరలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ ర్యాలీ శుక్రవారం కన్నులపండువగా జరిగింది. ఆయా గ్రామాల వీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం పట్ల ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేశారు. అహింస, త్యాగ నిరతిని ప్రపంచానికి చాటి చెప్పిన జగజ్జనని, లోక పావనిగా అమ్మవారిని తామంతా కొలుస్తామని సంఘ నాయకులు తెలిపారు.

కన్యకా పరమేశ్వరికి నూతన వస్త్రాల సమర్పణ



మండపేటలో కోటి నామావళి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని మండపేట రూరల్, అర్బన్ ప్రాంతాల్లో ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ద్వారపూడిలో కొలువుదీరిన వాసవీ మాతకు నూతన వస్త్రాలు సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాకచర్ల భాస్కర రావు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండపేట పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఎమ్మెల్యే వేగుళ్ల పాల్గొని అమ్మవారి కోటి నామావళి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు, 17వ వార్డు కౌన్సిలర్ కాళ్లకూరి స్వరాజ్య భవాని, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, యరగతపు బాబ్జి, చింతా శ్రీనివాసరావు, శ్రీఘాకోళ్లపు శంకర్, బొండాడ సీతారామయ్య, కొనగళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

80 అక్రమ మద్యం బాటిళ్ల స్వాధీనం

అయినవిల్లి: మండలంలోని చింతనలంకలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. వీరు యానం నుంచి ఈ మద్యాన్ని గుద్దటి దుర్గాప్రసాద్, గుద్దటి రాములు తరలిస్తున్నట్లు తెలిపారు. సుమారుగా 80 మద్యం బాటిళ్లను వీరి నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరూ ఈ మద్యం బాటిళ్లలో మద్యం సగం తీసి వేసి నీటిని కలిపి ప్యాకింగ్ చేసి అమ్ముతున్నారన్నారు. మద్యం సీసాలను కల్తీ చేసేందుకు వీరికి కొండుకుదురులో తయారీ కేంద్రం ఉన్నట్లు చెబుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

రామచంద్రపురం: రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పాత బకాయిలు రూ.3,480 కోట్లను తక్షణమే విడుదల చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లో విద్యా రంగానికి నిధులు పెంచాలని విద్యార్థులందరికీ తల్లికి వందనం, స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి వి.భీమశంకరం, పీవైఎల్ నాయకులు అంబటి కృష్ణ, ఐఎఫ్‌టీయూ నాయకులు చింతా రాజారెడ్డిలు డిమాండ్ చేశారు. పట్టణంలోని వారు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ విద్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు పెడుతున్న ఖర్చు ఇప్పటికే జీడీపీలో నాలుగు శాతం దాటడం లేదని దేశంలో విద్యారంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు దశాబ్దాల క్రితం కొఠారి కమిషన్ జీడీపీలో ఆరు శాతం కేటయించమని గట్టిగా సిఫారసు చేసిన పాలకులు పట్టించుకోలేదన్నారు. కేంద్ర బడ్జెట్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 2.57శాతం, 2024–25 ఆర్థిక సంవత్సరంలో 2.51 శాతం తగ్గించి మాత్రమే కేటాయించిందని వివరించారు. ప్రభుత్వాలు విద్యా రంగం నుంచి క్రమేపీ తప్పుకుంటున్నాయన్నారు. పాలకులు ప్రభుత్వ విద్యారంగాన్ని కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేస్తూ విద్యను వ్యాపారం చేస్తున్నారని వాపోయారు. పాలకులు అందరికీ చదువు అంటూనే దేశ వ్యాప్తంగా పదేళ్ల కాలంలో లక్ష ప్రభుత్వ పాఠశాలలు రద్దు చేశారని, రాష్ట్రంలో 4,500 పాఠశాలలు రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మూసివేతకు తెచ్చిన జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పిండ మార్పిడి పద్ధతులతో అధిక సంతానోత్పత్తి



మండపేటలో మేలు జాతి గేదెను పరిశీలిస్తున్న వైద్యులు

ఎన్‌కేబీసీ సహాయ సంచాలకులు దేవరాజ్

మండపేట: పాడి పశువుల పెంపకంపై రైతులకు ఆసక్తి పెంపొందించే దిశగా కేంద్ర పశుసంవర్ధక శాఖలో అన్ని రకాల సదుపాయాలు ఉంటాయని నేషనల్ కామధేను బ్రీడింగ్ సెంటర్ (ఎన్‌కేబీసీ) సహాయ సంచాలకులు బి.దేవరాజ్ తెలిపారు. నెల్లూరు జిల్లా ఎన్‌కేబీసీ వైద్యబృందం శుక్రవారం మండపేట, పరిసర ప్రాంతాల్లో పర్యటించింది. గ్రామాలు, పట్టణంలోని పలు పశువుల శాలలను సందర్శించి మేలు జాతి పశువులను గుర్తించారు. వాటి ద్వారా పిండోత్పత్తి, పిండ మార్పిడి చేయనున్నారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు దేవరాజ్ మాట్లాడుతూ పశువుల్లో సంతానోత్పత్తిని పెంచేందుకు ఎన్‌కేబీసీ ద్వారా పరిశోధనలు చేసి పిండోత్పత్తి, పిండమార్పిడి పద్ధతుల్లో మంచి ఫలితాలు సాధించామని వివరించారు. ఒక్కో పాడి పశువు ఏడాదికి ఒకటి చొప్పున ఎనిమిది దూడలను ఉత్పత్తి చేయగలవన్నారు. రెండేళ్ల క్రితం నెల్లూరు జిల్లా చింతలదీవిలో జాతీయ కామధేను బ్రీడింగ్ సెంటర్‌లో పిండోత్పత్తి, పిండ మార్పిడి పద్ధతిని ప్రవేశపెట్టామన్నారు. ఈ విధానం ద్వారా ఒక్క పశువు నుంచి 60–70 దూడలను ఉత్పత్తి చేయవచ్చునని తెలిపారు. నెల రోజులు మండపేట పరిసర ప్రాంతాల్లో పర్యటించి అనేక పశువులను పరిశీలించి పరిక్షించామన్నారు. అందులో పట్టణానికి చెందిన నిమ్మలపూడి వీర్రాజు, నిమ్మలపూడి సత్యనారాయణ, వేగుళ్ల ఓం తేజ నుంచి మూడు పశువులను తీసుకున్నట్టు తెలిపారు. జాతీయ పశు నమోదు పథకం ప్రతినిధి డాక్టర్ రాజేశ్వరరావు, పశువైద్యాధికారి టి.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన కేంద్ర బృందం



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌ఏఏసీ చైర్మన్ కులకర్ణి

మండపేట: మారేడుబాకలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎన్‌ఏఏసీ బృందం శుక్రవారం సందర్శించింది. గుజరాత్‌లోని సర్దార్ పటేల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ శిరీష్ కులకర్ణి నేతృత్వంలో మధ్యప్రదేశ్‌కు చెందిన డాక్టర్ ప్రమోద్‌కుమార్‌రాయ్, మహారాష్ట్రకు చెందిన డాక్టర్ విలాస్ సోనావాలే బృందం కళాశాలను పరిశీలించినట్టు ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ తెలిపారు. విద్యా సంబంధమైన అంశాలు, కాలేజీలో మౌలిక వసతులు, వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్య, వసతులపై ఆరా తీశారు. గత మూడు సంవత్సరాల్లో కళాశాలలో వచ్చిన అనూహ్యమైన మార్పులు, సోలార్ పవర్ ప్లాంట్ , ఏసీ లైబ్రరీ, కళాశాల గ్రౌండ్ అభివృద్ధి, బొటానికల్ గార్డెన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఏఏసీ చైర్మన్ కులకర్ణి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు అధ్యాపకుల చేతిలో ఉందన్నారు. అధ్యాపక బృందం అంకితభావంతో పనిచేసి విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కిరణ్, అధ్యాపకులు నెహ్రూ నాయక్, శంకర్, గోపాలకృష్ణ, సుందర్, రాజేష్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరంలో విషాదఛాయలు



కె.గంగవరంలో ఎస్సై మూర్తి స్వగృహం

కె.గంగవరం: పశ్చిమగోదావరి జిల్లా తణుకు రూరల్ ఎస్సై మూర్తి ఆత్మహత్య చేసుకోవడంతో మండల కేంద్రమైన కె.గంగవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్సై ఏజీఎస్ మూర్తి స్వగ్రామం కె.గంగవరం కావడంతో ఆయనతో పరిచయం ఉన్న స్నేహితులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. కె.గంగవరం గ్రామానికి చెందిన ఆదుర్తి గోపాలరావుకు ఇద్దరు కుమారులు. ద్వితీయ కుమారుడైన మూర్తి మంచిగా చదివి ఎస్సై ఉద్యోగం సంపాదించాడు. గోపాలరావు ఫెర్టిలైజర్ షాపుతో పాటు ధాన్యం కొనుగోలుదారుడిగా జీవనం సాగిస్తున్నాడు. అంతా సంతోషంగా ఉన్న తరుణంగా ఎస్సై మూర్తి తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుటుంబంలో పెనువిషాదం చోటు చేసుకుంది. అందరితో కలివిడిగా ఉండే మూర్తి మృతి చెందిన విషయం తెలియగానే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు పరిచయం ఉన్న ప్రతి ఒక్కరూ కన్నీటిపర్యంతమయ్యారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



ఉద్యోగ విరమణ చేసిన రామనారాయణను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

రాయవరం: ఉద్యోగులు విధి నిర్వహణలో చేసిన ఉత్తమ సేవలు కలకాలం నిలుస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీఆర్ ఏఈఈగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన రామనారాయణకు వీడ్కోలు సభను శుక్రవారం స్థానిక వీఎస్ఎం కల్యాణ మండపంలో నిర్వహించారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వర రావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ తదితరులు రామనారాయణ సేవలను ప్రశంసించారు. అనంతరం రామనారాయణ దంపతులను దుశ్శాలువా, పూలమాల, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఐ.పి.శెట్టి, ఎంపీడీవో ఎన్.కీర్తిస్పందన, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చైతన్యకుమారి, ఎంఈవో వై.సూర్యనారాయణ, స్థానిక నేత వుండవిల్లి రాంబాబు, కపిలేశ్వరపురం, మండపేట మండలాలకు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తత అవసరం



సీఐ సురేష్ చెప్పిన మాటలు వింటున్న విద్యార్థులు

మండపేట: ప్రతిఒక్కరూ ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని టౌన్ సీఐ దారం సురేష్ హెచ్చరించారు. పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యార్థి దశ నుంచే ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశలో ఎక్కువగా మొబైల్ ఫోన్లకు బానిస కావద్దన్నారు. బాగా చదివి జీవితంలో అనుకున్న లక్ష్యాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.